క్లుప్తంగా

సమాఖ్య మండల అధ్యక్షురాలిగా మమత



చిలప్‌చెడ్: ఎన్నికైన మండల సమాఖ్య పాలకవర్గంతో ఏపీయం, తదితరులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా జగ్గంపేటకు గ్రామానికి చెందిన కొడిపిగంటి మమత ఎన్నికయ్యారు. చిలప్‌చెడ్ ఐకేపీ కేంద్రంలో శనివారం మండల సమాఖ్య పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. సమాఖ్య కార్యదర్శిగా చిలుక మాధురి, కోశాధికారిగా బట్టు అంజలి ఎన్నికైనట్లు ఐకేపీ ఏపీఎం ప్రేమలత ఓ ప్రకటనలో వెల్లడించారు. కార్యక్రమంలో తూప్రాన్ ఏపీయం రుక్మిణి, అకౌంటెంట్ మానస, సీసీలు వరలక్ష్మి, నర్మద, ఆయా గ్రామ సంఘాల అధ్యక్షురాళ్లు పాల్గొన్నారు.

భూసారాన్ని బట్టి సాగు చేయాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

మనోహరాబాద్(తూప్రాన్): రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు శనివారం మండలంలో పర్యటించారు. కోనాయపల్లి(పీటీ), పోతారం గ్రామాల్లో రైతులకు ఆయిల్‌పాం సాగు, ఆదాయం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు విజయలక్ష్మి, డాక్టర్ వెంకటేష్, మండల వ్యవసాయ అధికారి స్రవంతి, ఏఈఓ నరేందర్‌గౌడ్, కృపారాణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

వెల్దుర్తి(తూప్రాన్): విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన మండలంలోని ఎల్కపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు జాల వెంకటేశ్ గేదె ఐదురోజుల క్రితం తప్పిపోయింది. శనివారం గ్రామ శివారులోని ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతంతో మృత్యువాత పడింది. రూ.60 వేల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు విజ్ఞప్తి చేశారు.

సిబిల్ స్కోర్‌తో సంబంధం లేదు

దుబ్బాకటౌన్: రాజీవ్ యువవికాస పథకంలో సిబిల్ స్కోరుతో సంబంధం లేకుండానే రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు శశికాంత్ అన్నారు. రాయపోల్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ యువతకు ఎలాంటి ఆటంకం లేకుండా రుణాలు మంజూరు చేయాలని అధికారులను కోరామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ స్వామి, నాయకులు ప్రశాంత్, ఇంద్రకరణ్, దుర్గ ప్రసాద్, చందు, యాదగిరి, మల్లేశ్, నరేశ్, స్వామి, నవీన్ తదితరులున్నారు.

అంబులెన్సు ఢీకొన్న ఆర్టీసీ బస్సు..

పసికందుకు గాయాలు

అల్లాదుర్గం(మెదక్): ఆర్టీసీ బస్సు, మదర్ అండ్ చైల్డ్ అంబులెన్సు ఢీకొనడంతో పసికందుకు స్వల్ప గాయాలు కాగా , మరో ఇద్దరికి ప్రమాదం తప్పింది. ఈ ఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిల్వెర గ్రామం వద్ద శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... అల్లాదుర్గం మండలం కోమటికుంట తండాకు చెందిన ముగ్గురు గర్భిణులు జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవించారు. ఈ ముగ్గురితో పాటు, పసిపాపలను తీసుకుని అంబులెన్సు కోమటికుంట తండాకు వస్తుండగా చిల్వెర బ్రిడ్జి కింద నుంచి మందాపూర్ వైపు వెళ్తోంది. ఈ క్రమంలో అల్లాదుర్గం వైపు నుంచి వేగంగా వచ్చిన సంగారెడ్డి డిపోకు చెందిన బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కోమటికుంట తండాకు చెందిన చామంతికి పుట్టిన పాపకు స్వల్పంగా గాయాలయ్యాయి. అంబులెన్సు డ్రైవర్ ప్రతాప్‌గౌడ్ ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్ రవిపై కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఎంఈఓ కృష్ణ అన్నారు. మండల పరిధిలోని సింగాటం ప్రాథమిక పాఠశాలలో శనివారం బడిబాట కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సంతోష్, ఉపాధ్యాయులు శేఖర్, కృష్ణ, ఆర్పీలు లింగం, విద్యాసాగర్, శ్రీనివాస్, శ్యామల, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.



చేపల మార్కెట్ వద్ద పైకప్పులేని మురికి కాలువ



మురికి కాలువ పక్కన కూరగాయల విక్రయం

వార సంత.. అసౌకర్యాల చింత

వారాంతపు సంత అసౌకర్యాలకు నిలయంగా మారింది. నర్సాపూర్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ప్రతి శుక్రవారం పట్టణంలో జరిగే సంతకు వచ్చి తమకు కావాల్సిన కూరగాయలు, చేపలు, దుస్తులు వంట సామగ్రి కొనుగోలు చేస్తుంటారు. అయితే పైకప్పు లేని మురికి కాలువల నుంచి వచ్చే దుర్వాసనతో వ్యాపారులు, కొనుగోలుదారులు అవస్థలు పడుతున్నారు. వర్షం పడితే చిత్తడిగా మారుతుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని జగన్నాథరావు కాలనీ వద్ద చేపల మార్కెట్‌కు చిన్న భవనం నిర్మించినా, అక్కడ అవసరమైన నీరు లేకపోవడం, పట్టణ ప్రజలకు దూరంగా ఉండడంతో అక్కడ చేపల దుకాణాలు ఏర్పాటు చేయలేకపోతున్నామని వ్యాపారులు చెబుతున్నారు. ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావును వివరణ కోరగా.. మురికి కాలువలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటానని చెప్పారు.

–నర్సాపూర్:

నూతన కార్యవర్గం

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల మహిళా సమాఖ్య భవనంలో శనివారం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా జ్యోతి, కార్యదర్శిగా లావణ్య, కోశాధికారిగా రేణుక ఎన్నికయ్యారు. ఏపీఎం ఇందిర, సిబ్బంది స్వామి, అరవింద్‌కుమార్ ఆయా గ్రామాల డ్వాక్రా గ్రూపు మహిళలు పాల్గొన్నారు.

స్పాట్ అడ్మిషన్లు

చేగుంట(తూప్రాన్): ఆంగ్లమాధ్యమంలో నిర్వహిస్తున్న చేగుంట గిరిజన బాలికల గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లతో సీట్లను భర్తీ చేయనున్నట్లు ఆర్‌సీఓ గంగారాం నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో మిగిలి పోయిన సీట్లకు 2025–26, సంవత్సరానికి గాను స్పాట్ కౌన్సిల్ ద్వారా ఎంపీసీ, బైపీసీలో మిగిలిన సీట్లను భర్తీ చేస్తామని ఆయన తెలిపారు.

డంపుయార్డులు నిరుపయోగం

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రతి పంచాయతీలో డంపుయార్డులు నిర్మించారు. తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి డంపుయార్డులకు తరలించాల్సి ఉంది. కాని పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. సేకరించిన చెత్తను రోడ్ల పక్కన, అటవీ ప్రాంతాలలోను డంపు చేస్తున్నారు. దీంతో డంపుయార్డులు నిరుపయోగంగా మారాయి.

- రోడ్ల పక్కనే చెత్తాచెదారం
- పర్యావరణానికి తూట్లు
- పట్టించుకోని అధికారులు



మందాపూర్ శివారులో వేసిన చెత్తా చెదారం



నిరుపయోగంగా డంప్‌యార్డు

అల్లాదుర్గం(మెదక్): మండలంలో 16 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతి పంచాయతీలో డంపుయార్డులను నిర్మించారు. అంతే కాకుండా పంచాయతీలు చెత్త రిక్షాలు, ట్రాక్టర్లను కొనుగోలు చేసి సిబ్బందికి అప్పగించాయి. కాని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఆ పని చేయటంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామాలలో సేకరించిన చెత్త ఎక్కడ పడితే, అక్కడ వేస్తూ పర్యావరణానికి ముప్పు తెస్తున్నారని వాపోతున్నారు.

ఎక్కడపడితే అక్కడే..

మండల పరిధిలోని మందాపూర్ గ్రామ శివారులో రోడ్డు పక్కన చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. అలాగే చిల్వెర గ్రామం శివారులో వ్యవసాయ పొలాలకు వెళ్లే రోడ్డు పక్కనే చెత్తను డంపుచేస్తున్నారు. ముప్పారం గ్రామంలో డంపుయార్డు మరుగుదొడ్డిగా మారింది. మండలంలోని ప్రతి పంచాయతీలోను ఇదే దుస్థితి నెలకొంది. ఉన్నాతాధికారుల పర్యవేక్షణ కరువైందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అటవీ ప్రాంతంలో..

అటవీశాఖ పరిధిలో ట్రాక్టర్లపై చెత్తను తెచ్చి పోస్తున్నారు. వన్యప్రాణులు, జంతువులు వాటిని తిని ప్రమాదాల బారిన పడుతున్నాయి. లక్షలు ఖర్చు పెట్టి డంపుయార్డులు నిర్మించినా ఫలితం మాత్రం శూన్యం. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి డంప్‌యార్డులను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి నాగమాధురి

పాపన్నపేట(మెదక్): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కల్తీ విత్తనాలు అమ్మితే సంబంధిత దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి నాగమాధురి హెచ్చరించారు. పాపన్నపేటలో ఫర్టిలైజర్ షాపుల యజమానులతో శనివారం నిర్వహించిన సమావేశంలో నాగమాధురి, ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని మాట్లాడారు. ప్రతీ విత్తన ప్యాకెట్‌పై నీలం, ఆకుపచ్చ రంగుల్లో ఉంటే ప్రభుత్వ ధ్రువీకరణ ట్యాగ్‌ను సరిచూసుకోవాలని సూచించారు. ప్రతీ ప్యాకెట్‌పై విత్తన రకం, లాట్ నంబర్ ఉంటుందని, విత్తనాల గడువు తేదీ కూడా నిర్ధారించుకోవాలని చెప్పారు. విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతీ రైతుకు రశీదు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో దుకాణదారులు,ఏఈఓలు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో ఏఐ ఆధారిత విద్య



శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో ఎంఈఓ విఠల్

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలు మరింత బలపడేలా ఈ విద్యా సంవత్సరం నుంచి ఏఐ ఆధారిత విద్యను అందించాలని మండల విద్యాధికారి విఠల్ అన్నారు. మండల పరిధిలోని చిట్కుల్ గ్రామ శివారులో గల కేజీబీవీలో ఉపాధ్యాయులకు నిర్వహించిన వృత్యంతర శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య బోధిస్తూ, కచ్చితమైన ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. జూన్ 6 నుంచి బడిబాట కార్యక్రమం నిర్వహించి, విద్యార్థుల నమోదు సంఖ్య గణనీయంగా పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్‌లు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా బోధన..

నర్సాపూర్: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన చేయాలని ఎంఈఓ తారాసింగ్ అన్నారు. శనివారం ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణా శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటేశం మాట్లాడుతూ.. విద్యలో నాణ్యత పెంచేందుకు నిర్వహించిన ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థులు సులభ పద్ధతిలో అర్థమయ్యేలా బోధన చేయాలన్నారు. బడిబాట కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సదుపాయాలపై తల్లిదండ్రులకు వివరించి, బలోపేతానికి చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్పీలు గోపి, రాధాకృష్ణ, శేఖర్‌గౌడ్, సుజిత్, కిషోర్ తదితరులున్నారు.

మెరుగైన విద్యనందించాలి

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఎంఈఓ బాలరాజు పేర్కొన్నారు. ఐదు రోజులుగా నిర్వహించిన ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. చివరిరోజు రిసోర్స్‌పర్సన్‌లు బోధనోపకరణ తయారీ, విద్యబోధన అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. మెరుగైన విద్యను అందించి విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్‌లు స్రవంతి, రమేష్, చందర్‌రెడ్డి, మహేశ్, మహిపాల్, మల్లేశం, గోవింద్, నవాజొద్దీన్, ఎంఐఎస్ ఆంజనేయులు, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోవుల సంరక్షణకు చర్యలు చేపట్టండి



తహసీల్దార్ సతీశ్‌కు వినతిపత్రం ఇస్తున్న బజరంగ్‌దళ్ కార్యకర్తలు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బజరంగ్‌దళ్ వినతి

చిన్నశంకరంపేట(మెదక్): హిందువులు దైవంగా భావించే గోమాతలను రక్షించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని తహసీల్దార్ మన్నన్‌కు వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ నాయకులు శనివారం వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం చట్టం ప్రకారం గోహత్యల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు అమలు చేయాలన్నారు. రాబోయే బక్రీద్ సందర్భంగా గోమాతలకు రక్షణ కల్పించాలని కోరారు. అనంతరం చిన్నశంకరంపేట పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐ విఠల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి నీల శ్యామ్, భజరంగ్‌దళ్ ప్రకండ ప్రముఖ్ సతీష్, మహేందర్, మల్లేశం, ఆర్‌ఎస్ ప్రముఖ్ శంకర్, శ్రీనివాస్, నవీన్, బీజేపీ మండల అధ్యక్షుడు రాజు, శంకర్ ఉన్నారు.

గోవధను అడ్డుకోవాలి

పాపన్నపేట(మెదక్): మండలంలో జరుగుతున్న గోవధను అడ్డుకోవాలని బజరంగ్‌దళ్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం బజరంగ్‌దళ్ సభ్యులు పాపన్నపేట తహసీల్దార్ సతీశ్,ఎస్సై శ్రీనివాస్‌గౌడ్‌లకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బజరంగ్‌దళ్ నాయకులు బోల క్రిష్ణ మాట్లాడుతూ... హిందువులు పవిత్రంగా భావించే గోమాతను వధించకుండా రక్షించాలని కోరారు. గోవధ నిషేధ చట్టాన్ని పటిష్ఠంగా అమలు పరచాలని డిమాండ్ చేశారు. బక్రీద్ పండుగ సమీపిస్తున్న తరుణంలో గోవుల రవాణాపై కన్నేసి ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో గోపాల్,భువనేశ్వర్,రాజేశ్,హరిబాబు తదితరులున్నారు.

అమరులకు నివాళిగా తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

చిన్నశంకరంపేట(మెదక్): పాకిస్తాన్ ఉగ్రదాడిలో అమరులైన పహల్గాం మృతులకు, భారత సైనికుల మృతికి నివాళిగా మండల కేంద్రంలో ఉపాధ్యాయులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. శనివారం మోడల్‌స్కూల్‌లో శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో మోడల్ స్కూల్ నుంచి సర్దార్ పటేల్ విగ్రహం వరకు జాతీయ జెండాలను చేతపట్టుకుని తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ పుష్పవేణి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శివప్రసాద్, గాలయ్య, సత్యనారాయణ, హరిబాబు, ప్రవీణ్ ఉన్నారు.

సైన్యానికిమద్దతుగా ఉపాధ్యాయుల తిరంగా ర్యాలీ

చేగుంట(తూప్రాన్): పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చేగుంటలో ఉపాధ్యాయ సంఘాలు మద్దతు ప్రకటిస్తూ శనివారం తిరంగా జెండా ర్యాలీని నిర్వహించారు. ఉగ్రదాడిలో చనిపోయిన అమరులకు, వీరజవాన్లు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కొద్దిసేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నీరజ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, రావుల వెంకటేశ్, బాలపోచయ్య తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు సంతాపం

రామాయంపేట(మెదక్): పహల్గాం మృతులకు మండల ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు. ఈమేరకు వారు శనివారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సమావేశమై చర్చించారు. అనంతరం మృతుల కుటుంబాలకు సంతాపం వ్యక్తం చేస్తూ మౌనం పాటించారు.

క్రీడలతో మానసికోల్లాసం

డాక్టర్ సూఫీ



అథ్లెటిక్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

మెదక్‌జోన్: క్రీడలు మానసిక, శరీరకంగా ఎంతగానో ఉపయోగపడుతాయని డాక్టర్ సూఫీ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రం ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ 2025 అండర్ -8, 10, 12 బాలబాలికలకు స్థానిక పోటీలు నిర్వహించారు. ఈ క్రీడల్లో జిల్లా నలుమూలల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. మూడు విభాగాల్లో కొనసాగిన ఎంపికలో పలువురు క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలు జూన్ 1న, హైదరాబాద్‌లోని జింఖానాగ్రౌండ్‌లో కొనసాగనున్నాయి. గెలుపొందిన క్రీడాకారులను వైద్యుడు సూఫీ అభినందించారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మధుసూదన్ ,సెక్రటరీ మహేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉల్లాస్ సర్వే

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా గ్రామాల్లో ఉల్లాస్ గుర్తింపు సర్వే కార్యక్రమం కొనసాగుతోంది. ఆయా గ్రామాల్లో వీఓఏలు ఇంటింటికీ తిరుగుతూ నిరక్షరాస్యులను గుర్తించి వివరాలు నమోదు చేస్తున్నారు. ఎస్సెస్సీ, ఇంటర్‌లో చదువు మధ్యలో ఆపివేసిన వారితో పాటు చదువు రాని వారి వివరాలు సేకరిస్తున్నారు. సర్వే పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఐకేపీ అధికారులు తెలిపారు.

మండల సమాఖ్య కార్యవర్గం ఎన్నిక

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రంలో శనివారం మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా రూప, కార్యదర్శిగా సోని, కోశాధికారిగా భాగ్యరాణిని ఎన్నుకున్నారు. మహిళా సంఘాల బలోపేతానికి నూతన కార్యవర్గం కృషి చేయాలని ఈ సందర్భంగా పలువురు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మోహన్, ఏపీఎం శంకరయ్య, సీసీలు సత్యం, యాదగిరి, శ్రీనివాస్‌గౌడ్, రజిత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ధరిపల్లి, గవ్వలపల్లి సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ దినకర్ తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు చెప్పారు. మండలంలోని ధరిపల్లి, సూరారం, గవ్వలపల్లి, అంబాజిపేట, కొర్విపల్లి గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు విషయం గమనించి సహకరించాలని కోరారు.

సైనికులకు సంఘీభావం

అల్లాదుర్గం(మెదక్): దేశం కోసం నిరంతరం పోరాటం చేస్తున్న సైనికులకు సంఘీభావంగా శనివారం అల్లాదుర్గంలో బీజేపీ నేతలు తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలను పట్టుకుని ర్యాలీ చేపట్టారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌కు కొలుకోలేని దెబ్బ తీశామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాములు, బాలరాజు, సతీశ్, భూమిరెడ్డి, రవి, యాదగిరి, శివకుమార్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.



తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మొలకెత్తిన ధాన్యం రాశులు

కాగజ్‌మద్దూర్‌లో రైతులు గగ్గోలు



కాగజ్‌మద్దూర్‌లో కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యం

నర్సాపూర్‌రూరల్: మండలంలోని కాగజ్‌మద్దూర్, నత్నాయపల్లితోపాటు పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ధాన్యం రాశులుతోపాటు బస్తాల్లోని ధాన్యం మొలకెత్తుతున్నాయి. ఆరుగాలం పడ్డ కష్టం అంతా వృథాగా పోతోందని రైతులు వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో లారీలు, హమాలీల కొరత కారణంగా ధాన్యం రాశులు పేరుకుపోయినట్లు రైతులు చెబుతున్నారు. అధికారులు నామమాత్రంగా కొనుగోలు కేంద్రాలను సందర్శించి వెళ్లిపోతున్నారే తప్ప తూకం వేగవంతం కావడానికి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. కాగజ్‌మద్దూర్‌లో పేరుకపోయిన ధాన్యం రాశుల కోసం సాక్షి ఇటీవల కథనాన్ని ప్రచురించడంతో తహసీల్దార్ శ్రీనివాస్ నామమాత్రంగా సందర్శించి వెళ్లిపోయారని రైతులు తెలిపారు.

ధాన్యం తరలింపుతో ఆర్థిక భారం



ట్రాక్టర్ ద్వారా ధాన్యం తరలిస్తున్న రైతులు



కొంతన్‌పల్లి కేంద్రం నుంచి ధాన్యం తరలిస్తున్న హమాలీలు

సాక్షి ఎఫెక్ట్..

శివ్వంపేట(నర్సాపూర్): కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం తరలించేందుకు ఆర్థిక భారమవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం కేంద్రాలకు లారీలు రాకపోవడంతో రైతులు సొంతంగా ట్రాక్టర్లు సమకూర్చుకుంటున్నారు. క్వింటాలుకు రూ.50, వెయింటింగ్ చార్జిలు, హమాలి భరించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం తరలింపులో ఆలస్యం, వర్షంతో ధాన్యానికి మొలకలు వచ్చాయని పంట పెట్టుబడి సైతం చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోయారు.

ధాన్యం తరలింపు..

శివ్వంపేట(నర్సాపూర్): కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం తరలింపులో ఇబ్బందులపై 'సాక్షి'దినపత్రికలో గురువారం 'తడిసిన ధాన్యంతో తంటాలు'పేరుతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి హమాలీలను ఏర్పాటు చేసి లారీల్లో ధాన్యాన్ని వివిధ రైస్‌మిల్స్‌కు శనివారం తరలించారు. మండల పరిధి కొంతన్‌పల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోని హమాలీలను ఇతర చోట్లకు తరలించడంతో ధాన్యం నిల్వలు పేరుకుపోయిన సంగతి తెలిసిందే.